నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | KAMAREDDY



జిల్లాలో వరుస కిడ్నాప్‌లు





యాచకురాలిని బైక్‌పై తీసుకెళ్తున్న కిడ్నాపర్



కల్లుబట్టీలో సీసీ కెమెరాలకు చిక్కిన కిడ్నాపర్

# చిన్నారులే టార్గెట్



**ఐదు రోజుల్లో మూడు ఘటనలు**

**పోలీసులకు సవాల్‌గా మారిన పిల్లల అపహరణ**

**భయాందోళనలో ప్రజలు**

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 5: నిజామాబాద్ జిల్లాలో చిన్నారుల వరుస కిడ్నాప్‌లు కలకలం సృష్టిస్తున్నాయి. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదు రోజుల్లోనే మూడు ప్రాంతాల్లో పిల్లలు అపహరణకు గురయ్యారు. ఇందులో ఇద్దరు పిల్లలను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. కిడ్నాప్‌కు గురైన వారంతా ఏడేండ్ల వయసులోపు పిల్లలు కావడం చర్చనీయాంశంగా మారింది. సులువుగా లక్షలు సంపాదించాలనే ఉద్దేశంతోనే పలువురు పిల్లలను కిడ్నాప్ చేస్తున్నట్లు సమాచారం. కొందరు ముఠాగా ఏర్పడి పిల్లలను కిడ్నాప్ చేసి రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ఇండ్లు, హోటళ్లలో పనులకు పెట్టి వెట్టి చాకిరీతోపాటు భిక్షాటనకు ఉపయోగిస్తున్నట్లు తెలిసింది.

**నమ్మిస్తారు.. అపహరిస్తారు..**

రద్దీ ప్రాంతాలు, ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారులను నమ్మిస్తూ, మాయమాటలు చెబుతూ కిడ్నాపర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తారు. అడ్రస్ చెప్పాలంటూ పెద్దలను పరిచయం పెంచుకొని దానిచాటున పిల్లలను అపహరించే అవకాశం ఉన్నది. జనం ఎక్కువగా ఉండే ప్రాంతాలతోపాటు తక్కువ జనసంచార ప్రాంతాలను ఎంపిక చేసుకొని కిడ్నాప్‌లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చుట్టుపక్కల ఉండే వాళ్లే పిల్లల అపహరణలో పాలుపంచుకోవడం విస్తుగొల్పుతున్నది.

**వైరల్ అవుతున్న న్యూస్..**

ఇటీవల పలు సామాజిక మాధ్యమాల్లో చిన్నారులను కిడ్నాప్ చేసే ముఠా సంచరిస్తుందంటూ ఓ వార్త దావానంలా వ్యాపిస్తున్నది. ఇదే సమయంలో జిల్లాలో వరుసగా పిల్లలు కిడ్నాప్‌కు గురవ్వడం ప్రజలను బెంబేలెత్తిస్తున్నది. గతంలో ఎన్నడూ లేనంతా వరుసగా కిడ్నాప్‌లు జరగడంపై అనుమానాలకు తావిస్తున్నది.

**జనవరి 30: మాలపల్లిలో..**

నగరంలోని మాలపల్లికి చెందిన మహ్మద్ మీహాజ్ (7) అనే బాలుడిని ఓ ముఠా కిడ్నాప్ చేసింది. బాలుడిని హైదరాబాద్‌లో రూ.3లక్షలకు విక్రయించింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసు ప్రత్యేక బృందాలు.. నాలుగు రోజుల్లో బాలుడిని రక్షించారు. కిడ్నాప్‌కు పాల్పడిన ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

**ఫిబ్రవరి 4: ఆర్మూర్‌లో..**

ఆర్మూర్ బస్టాండ్‌లో మెండోరాకు చెందిన గగన్ సిద్ధార్థ్ తేజ్(7) అనే బాలుడిని ఓ మహిళ కిడ్నాప్ చేసింది. తల్లిదండ్రులు బస్సు ఎక్కే ప్రయత్నంలో ఉండగా బాలుడిని తీసుకొని ఆ మహిళ మెట్‌పల్లి వైపు బస్సులో వెళ్లింది. మార్గమధ్యంలో ప్రయాణికులకు అనుమానం వచ్చి కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అసలు విషయం బయటపడింది. పోలీసులు బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

**ఫిబ్రవరి 4: కంఠేశ్వర్‌లో...**

నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద ఏడాదిన్నర బాబు(గణేశ్)తో తల్లి భిక్షాటన చేస్తుంటుంది. ఆదివారం ఉదయం ఓ జంట ఆ మహిళతో పరిచయం పెంచుకొని రాత్రి వరకు ఆమెతోనే ఉన్నారు. రాత్రి 8.30గంటల సమయంలో తల్లీబిడ్డలను తమ బైక్‌పై ఎక్కించుకొన్న జంట కంఠేశ్వర్ బైపాస్ వద్దకు తీసుకెళ్లింది. అక్కడే ఉన్న కల్లు బట్టీలో ఆమెకు కల్లు తాగించి ఏడాదిన్నర బాబును అపహరించుకొని వెళ్లారు. వెంటనే తేరుకున్న తల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానిత జంట తిరిగిన ప్రదేశాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించగా బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి.

# తప్పుకోవాల్సిందే..

**ఉన్నతాధికారుల నీచ రాజకీయం**

పీఏసీఎస్ పాలకవర్గాలపై తీవ్ర ఒత్తిళ్లు

రాజీనామాలు చేయాలంటూ నేరుగానే బెదిరింపులు

కుటిల నీతిని అవలంబిస్తున్న కాంగ్రెస్ సర్కారు

కొత్త తరహా పాత్రలు పోషిస్తున్న యంత్రాంగం



నిజామాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఉమ్మడి జిల్లాలో నీచ రాజకీయ క్రీడకు తెర లేపారు కొందరు ఉన్నతాధికారులు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అధికారులు బ్యూరోక్రసీ వ్యవస్థే సిగ్గుపడే పరిస్థితిని తీసుకొచ్చారు. అధికారంలో ఎవరున్నా కార్యనిర్వాహక వ్యవస్థలో పని చేసే వారంతా రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యవహరించాలి. ప్రజల సంక్షేమమే ఎజెండాగా పని చేయాలి. కానీ, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అందుకు భిన్నంగా పరిస్థితులు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచిందో లేదో కొంత మంది ఉన్నతాధికారుల వ్యవహార శైలిలో పెను మార్పు వచ్చింది. నేరుగా బెదిరింపులకు దిగే పరిస్థితి తలెత్తింది. అది కూడా రాజకీయంగా ఒత్తిళ్లకు పాల్పడుతుండడం విస్తుగొల్పుతున్నది. నిజామాబాద్ జిల్లాలో క్రియాశీలకమైన బాధ్యతలు నిర్వహించే ఓ ఉన్నతాధికారి బెదిరింపులు ఇప్పుడు రాజకీయ వర్గా ల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్లకు నేరుగా ఫోన్ చేస్తూ తప్పుకోవాలని బెదిరిస్తుండడం వివాదాస్పదంగా మారింది. వాస్తవానికి పీఏసీఎస్ చైర్మన్లు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యారు. రైతులే సభ్యులుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ పరపతి సం ఘాల్లో పాలకవర్గాలకు ఇటీవల అధికారుల వేధింపు లు ఎక్కువయ్యాయి. రైస్ మిల్లులు, ఇతరత్రా వ్యాపారాలు ఉన్నటువంటి అధ్యక్షులనే టార్గెట్‌గా పెట్టుకుని ఓ ఉన్నతాధికారి బెదిరింపులకు పాల్పడుతుండడం గమనార్హం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ అధికారులుగా నిర్వర్తించాల్సిన బాధ్యతలను వదిలి రాజకీయ పార్టీ నేతలు చెప్పే ఆదేశాలను పాటిస్తూ అధికార పార్టీకి తొత్తుగా, కార్యకర్తలుగా వ్యవహరించడం సరికాదని బాధితులు వాపోతున్నారు.

**రైస్‌మిల్లులే టార్గెట్..**

రైస్‌మిల్లు వ్యాపారంలో ఉన్న విండో చైర్మన్లకు ఇప్పుడు పెద్ద చిక్కు వచ్చి పడింది. సీఎంఆర్ వంకను బూచీగా చూపి రాజీనామా చేయాలంటూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారిని ఇబ్బంది పెడుతున్నట్లుగా తెలిసింది. లేదంటే తనిఖీల పేరుతో పౌరసరఫరాల శాఖ అధికారులను పంపించి ఇక్కట్లు సృష్టించడం పరిపాటిగా మారింది. నిజామాబాద్ రూరల్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో ఈ తరహా బెదిరింపులు రాజ్యమేలుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'ఫలానా వాళ్లు చెప్పారండి.. గమ్మున రాజీనామా చేసేయండి' అంటూ వాట్సాప్ కాల్స్ చేస్తున్నారు. 'మేము ఏం చేస్తాం. తప్పడం లేదు.. అర్థం చేసుకోండి. మా వాళ్లు వస్తే మళ్లీ ఇబ్బందులు వస్తాయ్... రేపటి కల్లా రాజీనామా చేసి విధులకు దూరంగా ఉండండి' అంటూ ఫోన్లలో బెదిరిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన ఓ నాయకుడు, మరో కాంగ్రెస్ నాయకుడితో కలిసి ఇదే పనిగా బీఆర్‌ఎస్ నేతలను వేధిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో టికెట్ దక్కించుకోలేక చతికిల పడిన సదరు నాయకుడు తన ఆధిపత్యం చెలాయించుకోవడం కోసం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేను కాదని వ్యవహారాలు నడుపుతుండడంపై కాంగ్రెస్ పార్టీలోనూ చర్చ జరుగుతున్నది. ఈ నియోజకవర్గంలో 22 పీఏసీఎస్‌లు ఉండగా, ఇప్పటికే పలువురిని బలవంతంగా రాజీనామా చేయించారు. ఇప్పుడు మరికొంత మంది వెంట పడుతూ వేధిస్తున్నారు.

**అధికార బల ప్రయోగం..**

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ నేతలైతే అధికార బల ప్రయోగానికి పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాన్సువాడలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన నాయకుడి తీరు కూడా ఇలాగే ఉంది. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాన్ని బెదిరిస్తూ స్థానిక ఎమ్మెల్యేకు సహకరించకూడదంటూ హుకూం జారీ చేస్తుండడం చర్చనీయాంశమైంది. ఇప్పుడేమో పీఏసీఎస్ పాలకవర్గాలపై జరుగుతున్న అధికార బల ప్రయోగం హస్తం పార్టీ నేతల అధికార దాహాన్ని చాటి చెబుతున్నది. బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచిన చోట కూడా ఇదే తరహా బెదిరింపు రాజకీయాలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేల కన్నా కూడా ఓడిపోయిన నేతలే అధికారాన్ని చెలాయించాలని చూస్తుండడం, వారికి ఉన్నతాధికారులు సైతం వంత పాడుతుండడం విస్మయం కలిగిస్తున్నది.

# ప్రజావాణి.. పట్టించుకునేవారేరి?

**కార్యక్రమ నిర్వహణ అస్తవ్యస్తం**

**పలు శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు**

**కలెక్టరేట్ ఆవరణలో పూల మొక్కలకు రక్షణ కరువు**

**కనిపించని సెక్యూరిటీ గార్డులు**



'ప్రజావాణి' హాలులో బైఠాయించి నిరసన తెలుపుతున్న పచ్చల నడ్కుడ గ్రామస్తులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 5: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అభాసుపాలవుతున్నది. తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశతో జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు నిరాశే ఎదురవుతున్నది. ప్రజావాణి కార్యక్రమానికి కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరవడం, వందల సంఖ్యలో వస్తున్న వారిని క్రమపద్ధతిలో నిలువరించకపోవడంతో అధికారులకు వినతిపత్రాలు, ఫిర్యాదులు ఇవ్వడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుండగా.. వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామస్తులు సుమారు 50 మంది లోపలికి చొచ్చుకు వచ్చారు. జాన్కంపేట్, పచ్చల నడ్కుడ గ్రామాల మధ్య ఉన్న వాగు సమస్యను పరిష్కరించాలని కోరుతూ బైఠాయించి, నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

**కానరాని సెక్యూరిటీ**

సమావేశపు హాలులోకి పరిమిత సంఖ్యలో ఫిర్యాదుదారులను పంపించాల్సి ఉండగా.. ఒకేసారి 50 మంది చొచ్చుకురావడంతో సెక్యూరిటీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజావాణి కార్యక్రమంలో ఇలా నిరసన తెలుపడం తొలిసారి కావడం గమనార్హం.

**ఫిర్యాదుల వెల్లువ**

సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 97 వినతులు రాగా.. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రాకపోవడంతో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రాతోపాటు పలువురు అధికారులు స్వీకరించారు. నగరానికి చెందిన రాజయ్య, సరోజ, గంగాధర్ దివ్యాంగులు తమకు ఆసరా పింఛన్ రావడంలేదని ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నగరంలోని 171,172 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో రెండేండ్లుగా గుడిసెలు వేసుకొని 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, తమను రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీపీవో జయసుధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



**పూల మొక్కలకు రక్షణ కరువు**

న్యూ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రంగురంగుల పూలమొక్కలకు రక్షణ కరువైంది. నిత్యం ఏదో ఒక పని నిమిత్తం వచ్చే వారు తమకు నచ్చిన పూల మొక్కలను యథేచ్ఛగా తీసుకెళ్తున్నారు.

## పెళ్లి చేసుకుంటానని ముఖం చాటేసిన పోలీసు

**రాణా ఎదుట బైఠాయించిన బాధితురాలు**

**అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఎస్సై?**

ఇందల్వాయి, ఫిబ్రవరి 5: పెళ్లి చేసుకుంటానని మహిళను నమ్మించి వంచించిన ఓ పోలీసు అధికారి బాగోతం ఆలస్యంగా వెలుగుచూసింది. న్యాయం కోసం బాధితురాలు ఠాణా ఎదుట బైఠాయించింది. దీంతో సదరు అధికారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలిసింది. అసలేం జరిగిందింటే.. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఇందల్వాయి పోలీసుస్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆందోళనకు దిగింది. ఎస్సై మహేశ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బాధితురాలు అక్కడే బైఠాయించింది. పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేస్తున్నాడని వాపోయిన ఆమె.. ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే, ఈ సమాచారం తెలిసి ఉన్నతాధికారులు మందలించినట్లు తెలిసింది. మరోవైపు, సదరు ఎస్సై తన సిమ్‌కార్డును పోలీసుస్టేషన్‌లోనే ఉంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారుల వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు సరిగా స్పందించలేదు.

## స్నేహితుడిని బలిగొన్న ఘర్షణ

**కత్తితో దాడి చేసిన యువకుడి తల్లి**

**దవాఖానలో చికిత్స పొందుతూ మృతి**

**పోలీసుల అదుపులో నిందితులు**



మృతుడు పవన్ (ఫైల్)

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 5: నగరంలోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకుకారణమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. గౌతం నగర్ కు చెందిన పవన్(20) ఆదివారం రాత్రి తన స్నేహితులైన చందు, చిన్ను యాదవ్ వద్దకు వెళ్లగా.. మద్యం తాగించాలన్న విషయంపై ముగ్గురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పవన్ అక్కడి నుంచి ఇంటికి వెళ్లిపోయాడు. ఘర్షణ విషయం తెలుసుకున్న చిన్నుయాదవ్‌తో పాటు అతని తల్లి రేణుక, చందు కలిసి పవన్ ఇంటికి వెళ్లి అతడిని కత్తితో పొడిచింది. తీవ్రగాయాలైన పవన్‌ను స్థానికులు వెంటనే జిల్లా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతు డి తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు రేణుక, చిన్ను యాదవ్, చం దులపై కేసు నమోదు చేసి,అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు నగర సీఐ నరహరి తెలిపారు. పవన్ అంత్యక్రియలు నిర్వహించే ఆర్థిక పరిస్థితి వారి కుటుంబానికి లేకపోవడంతో త్రీ టౌన్ ఎస్సై ప్రవీణ్ సూచన మేరకు ఇందూ రు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చారు. దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

